రంగు నీళ్లు.. ఇంకెన్నాళ్లు?

• 3 నెలలుగా కలుషిత నీరు • అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



పలు ఇళ్లల్లోకి సరఫరా అవుతున్న కలుషిత నీరు



కలుషిత జలాలకు కారణమైన మ్యాన్‌హోల్

కుత్బుల్లాపూర్ : గాజులరామారం డివిజన్ పరిధిలోని బతుకమ్మ బండ, దేవేందర్ నగర్, నరసింహ బస్తీ, రావి నారాయణరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న పైప్ లైన్ నుంచి మూడు నెలలుగా మురుగునీరు సరఫరా అవుతుంది. ఈ విషయంపై సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులకు గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ప్రజావాణిలో సైతం ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోవడంతో ప్రతిరోజు వచ్చే మురుగు నీటిని పట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతిరోజు వివిధ ప్రాంతాల్లో లీకేజీలు, ఇతరత్రా సమస్యలపై వచ్చే ఫిర్యాదుల విషయంలో ఎప్పటికప్పుడు స్పందించాల్సిన వాటర్ వర్క్స్ అధికారులు అది తమ పరిధి కాదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కాలనీల్లో సరఫరా అవుతున్న మురుగునీటి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గాజులరామారం మేనేజర్ రోహిణి ని 'సాక్షి' వివరణ కోరగా.. డ్రైనేజీ ప్రాంతంలో లీకేజీ ఏర్పడడం మూలంగా ఈ సమస్య ఏర్పడుతుందని, క్షేత్రస్థాయిలో గుర్తించి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్య భార్గవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గాజులరామారం గ్రామం, బాలాజీ లేఅవుట్, ఉషోదయ కాలనీ, రోడామేస్త్రీనగర్, వివేకానందనగర్, ఎస్ఈబీ నగర్, శ్రీరామ్‌నగర్, బేకరీ గడ్డ, వల్లభాయ్‌పటేల్ నగర్, భవానీనగర్, పీపీ నగర్, గాజులరామారం చౌరస్తా, శ్రీవెన్ ఎన్‌క్లేవ్, వోక్షిత హిల్‌వ్యూ, తత్వా స్కూల్ గల్లీల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల వార్షిక నిర్వహణ నేపథ్యంలో శుక్రవారం సరఫరాలో అంతరాయం కలుగనుందని ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎలీప్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్, శిల్ప లేఅవుట్, కెనరా బ్యాంక్, డాక్టర్స్ కాలనీ, అంబ భవానీ హోటల్, మున్సిపల్ కార్యాలయం, ఎస్‌బీఐ బ్యాంక్, ఎన్టీఆర్ పార్కు, జుడో షాపింగ్ మాల్, తిరుమల ఫర్నీచర్స్, ప్రగతి సెంట్రల్ స్కూల్, ఎలిఫాంట్ సర్కిల్, శ్రీకృష్ణ గార్డెన్స్, డాలర్ హిల్స్, ప్రశాంతి గోల్డెన్ హిల్స్, సాయిలక్ష్మి లేఅవుట్, జగన్ స్టూడియో, ఎస్ఆర్ఐ కాలనీ, విష్ణుప్రియనగర్, ప్రగతి ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్స్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

హైదర్‌నగర్ సెక్షన్ పరిధిలో..

- హెచ్ఎంటీ హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బృందావన్ కాలనీ, గ్రీన్ హౌస్ అపార్ట్‌మెంట్, ప్రగతి అపార్ట్‌మెంట్, కొలన్ రాఘవరెడ్డి ఫంక్షన్ హాలు, ఎస్ఎల్ఎస్ఆర్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్లు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు సందర్భంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు మీనాక్షి కాలనీ, స్ప్రింగ్ ఫీల్డ్‌కాలనీ, అంగడిపేట్ గ్రామం, 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు జయరామ్‌నగర్, శ్రీకృష్ణనగర్, రుక్మిణి ఎస్టేట్స్, జేకే నగర్, చర్మాస్ జీన్స్ ఫ్యాక్టరీ, 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రామరాజునగర్, రష్ ఆస్పత్రి, మైఫ్రెండ్స్ సర్కిల్, గ్రీన్ పార్క్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

మోహనరంగా బలహీన వర్గాల ఆశాజ్యోతి



మోహన రంగా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కూన శ్రీశైలం గౌడ్

చింతల్: మోహనరంగా బలహీన వర్గాల ఆశాజ్యోతి అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా చింతల్ హెచ్ఎంటీ కాలనీలోని నల్ల పోచమ్మ గుడి వద్ద కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోహన రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి రావు, కాపు సేవా సమితి నాయకులు లింగ రవి, రామచంద్ర రావు, విల్ల మూర్తి, ఏసు బాబు, తోట రామ్మోహన్, సత్యనారాయణ, నవీన్, సనక వెంకట్, జగన్మోహన్, ఏవీ రావు, సుబ్రహ్మణ్యం, కిషోర్, కోటేశ్వరరావు, టింపుల్ సత్యనారాయణ, సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానం



శ్యామ్‌రావును సన్మానిస్తున్న ఏకలవ్య సంఘం సభ్యులు

సుభాష్‌నగర్: నేషనల్ సెన్సార్ బోర్డు మెంబర్‌గా నియమితులైన దాసరి శ్యామ్‌రావును గురువారం ఏకలవ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గండిమైసమ్మలోని బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్యామ్‌రావును శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దుండిగల్– గండి మైసమ్మ ఏకలవ్య సంఘం అధ్యక్షుడు దేవర కృష్ణ, ప్రధాన కార్యదర్శి అంగడి బాలేష్, దాసరి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కేలండర్ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి సన్నిధిలో పీఆర్‌టీయూ కూకట్‌పల్లి మండల శాఖ కేలండర్‌ను గురువారం సంఘం జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకట్, మండల ప్రధాన కార్యదర్శి విఠల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్‌గౌడ్, మండల అసోసియేట్ ప్రెసిడెంట్ నాయని చంద్రశేఖర్, మండల వైస్ ప్రెసిడెంట్ వీరేందర్, జిల్లా కార్యదర్శి ప్రదీప్ సింగ్ పాల్గొన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటాలు



బాలానగర్: కార్మిక, కర్షకుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసేది సీపీఐ పార్టీయేనని ఆ పార్టీ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ అన్నారు. పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గురువారం శ్రీశ్రీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివప్రసాద్, షణ్ముఖరావు, రాములు, దావిద్, రాజుగౌడ్, నారాయణ, ఉమారాణి, చంద్రమ్మ, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా ప్రొ.విద్యాసాగర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా ప్రొ.విద్యాసాగర్ నియమితులయ్యారు. క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్‌గా కొనసాగుతున్న ఆయన గతంలో వైస్ ప్రిన్సిపాల్‌గా, బీవోఎస్‌గా తదితర పదవులను చేపట్టారు. వచ్చే నెల 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 16 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

చిన్నారిని తల్లి చెంతకు చేర్చిన పోలీసులు



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్టీయూ మెట్రోస్టేషన్ వద్ద మూడేళ్ల చిన్నారి తప్పిపోయి రోదిస్తుండగా స్థానికులు గుర్తించి కేపీహెచ్‌బీ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఆ బాలికను తమ సంరక్షణలోకి తీసుకుని తల్లిదండ్రుల వివరాలను సేకరించే ప్రయత్నం చేశారు. పాప తల్లిదండ్రుల పేర్లు గానీ, ఇంటి అడ్రస్ చెప్పలేని స్థితిలో ఉంది. దీంతో పోలీసులు బాలిక ఫొటోతో తల్లిదండ్రుల ఆచూకీ కోసం ప్రసార మాధ్యమాల ద్వారా, ఇతరత్రా మార్గాల్లో ప్రయత్నాలు మొదలుపెట్టారు. చివరకు నిజాంపేటలోని ఓ హాస్టల్‌లో పని చేసే సిబ్బంది కుమార్తెగా పోలీసులు గుర్తించారు. పాపను సురక్షితంగా తన తల్లికి అప్పగించారు. జేఎన్టీయూ మెట్రో స్టేషన్ వద్దకు బాలిక తల్లి, బంధువులు గురువారం షాపింగ్ నిమిత్తం రాగా.. ఆ సమయంలో బాలిక తప్పిపోయింది. తమ కూతురిని తమ చెంతకు చేర్చిన కేపీహెచ్‌బీ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏబీవీపీ రాష్ట్ర కమిటీలో జేఎన్‌టీయూహెచ్ విద్యార్థులు

కేపీహెచ్‌బీకాలనీ: ఏబీవీపీ రాష్ట్ర మహాసభలలో ప్రకటించిన నూతన రాష్ట్ర కమిటీలో జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి నాయకులకు చోటు దక్కింది. వివిధ కమిటీల్లో ఆరుగురు విద్యార్థి నాయకులు నియమితులయ్యారు. రాష్ట్ర టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా పి. ప్రశాంత్, యూనివర్సిటీస్ కో కన్వీనర్‌గా ఎస్. నాగరాజు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఎస్. పూజిత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా డి. దివ్య, ఎం. రిషి, రాష్ట్ర కన్వీనర్‌గా పి. సిద్ధికలు నియమితులయ్యారు.

రేపు తైలాభిషేకం

మోతీనగర్: శని త్రయోదశి సందర్భంగా కబీర్‌నగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్, అవంతినగర్‌లోని శివ రామాంజనేయ ఆలయంలోని శనీశ్వరస్వామికి శనివారం తైలాభిషేకం, తిలాదానం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తైలాభిషేకం, శనిగ్రహ దోష నివారణ చేసుకునే వారు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కేపీహెచ్‌బీకాలనీ: పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను కేపీహెచ్‌బీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనివాస కాలనీలోని బీఎంఆర్ హైట్స్, ఫ్లాట్ నెంబర్ 302లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు రైడ్ చేసి పేకాడుతున్న డి. రాము, ఆర్.వంశీ, సీహెచ్. రాజేష్, జి. మనోహర్, డి. వెంకట శివరామరాజు, ఏ. శ్రీహరిరాజు, జి. సీతారామరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42,420, ఏడు సెల్ ఫోన్లను, తొమ్మిది సెట్ల కార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నేడు అభిషేక మహోత్సవం

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని గోదా రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు రంగనాయక స్వామికి అభిషేక మహోత్సవం, జనవరి 8వ తేదీన దీపోత్సవం, 10న వైకుంఠ ఏకాదశి, 11న కుడార్వై, 13న గోదా రంగనాయక స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ, ఎన్టీఆర్ నగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం హారతి పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా భక్తుడు సందీప్ నానమ్మ కొండెడ్డి రత్నం ప్రథమ వర్ధంతి సందర్భంగా భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరిస్తా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్

బాలానగర్: కమ్యూనిటీహాల్ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఫతేనగర్ డివిజన్ గౌతమ్ నగర్‌లో అల్ అన్సారీ సొసైటీ ఆధ్వర్యంలో 210 గజాల్లోని వారి సొంత స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల వివాహాల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించటం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జహీర్ సలాఉద్దీన్, అధ్యక్షులు ఎండీ గౌస్, ఉపాధ్యక్షులు ఎండీ యూసుఫ్, ఎండీ ఖలీల్ గౌరేమియా, ఎండీ నిస్సార్ అహ్మద్, ఎండీ ముజీబ్, ఎండీ అక్రం పాల్గొన్నారు.

మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడితే సహించబోం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ఆంధ్ర ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా కొంతమంది ఎమ్మెల్యేలు మాట్లాడుతున్నారని, వారి పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణా తరగతుల్లో నేర్చుకుంది ఇదేనా? ఆయన ప్రశ్నించారు. సినీ పరిశ్రమను చెన్నారెడ్డి తమిళనాడు నుంచి హైదరాబాద్ నగరానికి తీసుకొచ్చారని తెలిపారు. హైదరాబాద్ మహా నగరంలో సినీ పరిశ్రమ ద్వారా లక్షల మంది ఉపాధి పొందుతున్నారని, అందరూ మన బిడ్డలే అని, ఆంధ్ర, తెలంగాణ అనే భావం తేవద్దు అని హితవు పలికారు. సమావేశంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీలను రెగ్యులరైజ్ చేయండి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ విజ్ఞప్తి



కంటోన్మెంట్: పట్టణ ప్రాంతంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తూ మెప్మా ఆధ్వర్యంలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీ)లను రెగ్యులర్ చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రిని కలిసి ఆర్‌పీల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మహిళా సంఘాల బలోపేతానికి ఎన్నో ఏళ్లగా ఆర్పీలు కృషి చేస్తున్నారని తెలిపారు. జీవో నెం. 60 ప్రకారం ఆర్‌పీలకు జీతభత్యాలు చెల్లించాలని, అలాగే వారికి రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్స్, కాంట్రాక్ట్ ఉద్యోగుల లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 60 ప్రకారం ఆర్‌పీలకు జీతాలు చెల్లించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ దుండిగల్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పరశురామ్‌గౌడ్ తదితరులు ఉన్నారు. - దుండిగల్





ప్రమాదకరంగా రోడ్డు!

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంబడి మట్టిని సమాంతరంగా చదును చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా నుంచి చింతల్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు ఎత్తుగా ఉండటంతో వేగంగా వెళ్లే క్రమంలో వాహనదారులు దిగువకు జారుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు పక్కన మట్టి పోసి సమాంతరంగా చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటుంది. ఇక రాత్రిళ్లు అయితే వాహనదారుల పరిస్థితి అధ్వానంగా మారుతోంది. సర్కిల్ అధికారులు స్పందించి రోడ్డు పక్కన మట్టి పోయించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలు వివరిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని, ఆ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజా ప్రతినిధులు, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అందుబాటులో ఉన్న ఆయన వివిధ విభాగాల అధికారులకు ఫోన్లు చేసి ప్రజలు వివరించిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మరి కొంతమంది ఆహ్వానాలు అందజేశారు.

- సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ జైశ్రీరామ్ నగర్ కాలనీ నూతన సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, వేణు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలు వివరించారు. కాలనీ అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు సంక్షేమ సంఘాలు భాగస్వాములవ్వాలని సూచించారు.
- డీసీఎం డ్రైవర్ల పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని బీఎంఎస్ గాంధీనగర్, కొంపల్లి డీసీఎం పార్కింగ్ స్టాండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు వారాల సమ్మయ్య యాదవ్, మల్లికార్జున్ ఎమ్మెల్యేను కోరారు. చలాన్లతో వేధిస్తున్నారని వివరించారు. వారిని కట్టడి చేయాలని, లేకుంటే తమ బతుకులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.
- బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించే దిశగా అధికారులపై ఒత్తిడి తేవాలని వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యంతో పాటు నీటి వసతి కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. ఆయా విభాగాల అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ప్రజా సంఘాల నేతలు తమ సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతి పత్రాలు సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా గాజులరామారంలోని శ్రీ చిత్తారమ్మ దేవి జాతర జనవరి 19న జరుగనుందని, ముఖ్య అతిథిగా హాజరుకావాలని శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంతయ్య గౌడ్, బాలరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు



పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

నిజాంపేట్: పెత్తందారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర సీపీఐ పార్టీదేనని ఆ పార్టీ బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు వెంకటరామయ్య అన్నారు. గురువారం నిజాంపేట్ వార్డు కార్యాలయం, రాజధాని స్కూల్ వద్ద నిజాంపేట్ శాఖ కార్యదర్శి యాదయ్య ఆధ్వర్యంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి నాయకులు మాట్లాడారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో సీపీఐ పార్టీ ఏర్పడిందని, నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన పోరాడుతూ వస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి కేంద్రం వెనక్కి తగ్గేలా చేసిన ఘనత తమ పార్టీదేనన్నారు. జగన్నాథం, వెంకటరామయ్య, బ్రహ్మానందం, చెన్నారెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో ఢిల్లేశ్వర్ రావు, వాసు, దుర్గయ్య, మోహన్ రెడ్డి, పరమేష్, జితేందర్, నర్సమ్మ, మల్లమ్మ, పద్మమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి



కంటోన్మెంట్: కేంద్ర ప్రభుత్వం నిధులతోనే కంటోన్మెంట్లో అభివృద్ధి కొనసాగుతుందని బోర్డు సభ్యుడు రామకృష్ణ అన్నారు. గురువారం కంటోన్మెంట్ ఆరో వార్డు పరిధిలోని జవహర్ రైల్వే కాలనీ, జూపిటర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించడం లేదన్నారు. స్థానిక పన్నులు, కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కంటోన్మెంట్ వ్యాప్తంగా అన్ని వార్డులు కాలనీలలో ఏ చిన్న సమస్య అయినా, తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కంటోన్మెంట్ కు అధిక మొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉందన్నారు. ఆ నిధులతో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు బీజేపీ అధ్యక్షుడు అజయ్ గౌడ్, బీజేపీ నాయకులు ప్రతీక్, రవీందర్ రెడ్డి, కాలనీవాసులు మహేష్, ప్రసాద్, తిరుపతి, రమేష్, చంద్రశేఖర్, సుధాకర్, కార్తీక్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.